సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



నాన్నమ్మ పక్కలోంచి తీసుకెళ్లి..

నూజివీడులో నాలుగేళ్ల చిన్నారిపై గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నాన్నమ్మ పక్కలో నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టాడు. 8లో ▸



ఉప్పు సాగుకు వరుణుడి దెబ్బ

సాగు మొదట్లో ఉప్పు ధర ఆశాజనకంగా ఉన్నా.. ప్రకృతి కన్నెర చేయడంతో దిగుబడి భారీగా తగ్గింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. 8లో ▸



రాజకీయ పైరవీలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్లో చోటు కోసం కూటమి నేతలు పైరవీలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సందేశాలతో తల్లిదండ్రులు బిత్తరపోతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

పంటు రాకపోకల పునరుద్ధరణ



రాత్రి వేళ పంటు రాకపోకలు

నరసాపురం: 18 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత నరసాపురంలోని వశిష్ట గోదావరి మాధవాయిపాలెం రేవులో సోమవారం నుంచి పంటు రాకపోకలు పునరుద్ధరించారు. ఇటీవల వరదలు, గోదావరి ప్రవాహ ఉధృతి కారణంగా పంటు రాకపోకలు నిలిపివేశారు. గోదావరి ప్రవాహ ఉధృతి, నీటమట్టం తగ్గడంతో రాకపోకలు పునరుద్ధరించారు. ఇదిలా ఉంటే రాత్రి 8 గంటలు దాటిన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా పంటు రాకపోకలు సాగించడం, ప్రయాణికుల భద్రతను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

206 అర్జీల స్వీకరణ



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా ఫిర్యాదులకు సత్వరమే పూర్తి పరిష్కారం చూపాలని కేఆర్ ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 206 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య పరికరాలకు రాయితీలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో సూక్ష్మ సేద్య పథకంలో బిందు, తుంపర సేద్య పరికాలను రాయితీపై అందిస్తున్నామని కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రంతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి జిల్లాకు చేరుకున్నారు. వీరిలో 16 మందికి కలెక్టర్ వెట్రిసెల్వి పోస్టింగ్‌లు ఇస్తూ ఆయా మండలాలకు కేటాయించారు. ఏలూరు కలెక్టరేట్ ఏఓగా ఎన్‌వీ నాంచారయ్య, ఏలూరు సూపరింటెండెంట్ కో–ఆర్డినేషన్ సెక్షన్ పి.రవి కుమార్, ల్యాండ్ రికార్డ్స్ ఏఓగా జి.విజయ్ కుమార్ రాజు, డీఏఓగా ఎస్.సారా శాంతిని నియమించారు. అలాగే మండలాల వారీగా పి.సతీష్ (ఉంగుటూరు), బి.రమాదేవి (భీమడోలు), బి.సుమతి (దెందులూరు), జి.సుందర్‌సింగ్ (పెదవేగి), డీఎల్ ప్రమద్వర (చింతలపూడి), జి.ఎలీషా (కామవరపుకోట), జేవీ సుబ్బారావు (ద్వారకాతిరుమల), బీఎస్‌వీఎస్ ఆర్ఎల్ సాయిరాజు (పోలవరం), చల్లన్న దొర (కొయ్యలగూడెం), జేఎస్ సుభాని (ముదినేపల్లి), కె.రాజ్‌కుమార్ (ముసునూరు), ఎం.ఉదయ్‌భాస్కరరావు (కైకలూరు)లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వచ్చేనెల 1 నుంచి పశుగణన

ఏలూరు(మెట్రో): జిల్లాలో వచ్చేనెల 1 నుంచి డిసెంబర్ 21 వరకు పశుగణన నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. కలెక్టర్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన నిర్వహిస్తారన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కుక్కలు వంటి జీవాలను లెక్కిస్తామన్నారు. 417 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపర్‌వైజర్లు పశుగణన విధుల్లో పాల్గొంటారని, వీరికి మంగళవారం నుంచి 9వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు.

సాగు నీరందించాలి

ఏలూరు (టూటౌన్): కృష్ణా డెల్టా శివారు ప్రాంతాలైన పెదపాడు మండలం ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేసి అనంతరం మీ కోసం కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సాగు నీరు ఇచ్చి నాట్లు వేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

తల్లికి వందనం... ఎగనామం !

ఏపీ మా 15 వేలు.. 15 వేలు.. 15 వేలు.., చంద్రం తాతయ్యా.. ఇచ్చేదాకా వదిలేదే లేదు.., డేటా లేదా.. ఇదిగో తీసుకో, పోయాం.. మోసపోయాం.. అంటూ కూటమి ప్రభుత్వంపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో **తల్లికి వందనం పేరిట చేసిన ప్రచారానికి వీడియోలు జోడించి సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. తగ్గేదేలే.. మీమ్స్ వదిలేదేలే.. అంటూ చెడుగుడు ఆడుతున్నారు. ఈ వీడియోలకు మంచి స్పందన రావడంతో పాటు వేలల్లో లైక్‌లు, షేర్‌లు కూడా వస్తున్నాయి.**

రీల్స్‌తో చెడుగుడు



- కూటమి ప్రభుత్వంపై వైరలవుతున్న మీమ్స్
- చంద్రం తాతయ్యా.. ఇచ్చేదాకా వదలబోమంటూ ట్రోల్స్
- కూటమి తీరుపై సర్వత్రా నిరసన
- ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ రీల్స్‌లో ఇవే వీడియోలు
- పెద్ద ఎత్తున లైక్‌లు, షేర్‌లు
- మంత్రి నిమ్మలపై గోదారోళ్ల వెటకారంతో మీమ్స్
- పథకం అమలులో ప్రభుత్వం వెనుకడుగుపై విమర్శనాస్త్రాలు

ఇంకెప్పుడు ?



ఎప్పుడిస్తావు ?



తల్లికి వందనంపై ప్రభుత్వ తీరుకు నిరసనగా వైరల్ అవుతున్న రీల్స్



సాక్షి, భీమవరం: గత నెల 11న విడుదల చేసిన మార్గదర్శకాల్లో తల్లి వందనం కింద ఒక తల్లికి రూ.15,000 అంటూ ప్రభుత్వం మెలిక పెట్టింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం వెంటనే యూటర్న్ తీసుకుంది. విధివిధానాల రూపకల్పనలో జాప్యం జరుగుతోందని, ఈ పథకాన్ని ఇప్పట్లో అమలుచేసేది లేదని శాసనమండలి వేదికగా విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ తేల్చి చెప్పి రాష్ట్రంలోని లక్షలాది మంది తల్లుల ఆశలపై నీళ్లు చల్లారు.

సమగ్ర సమాచారం ఉన్నా.. వాస్తవానికి యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యుడైస్ ప్లస్) ద్వారా జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలను ఏటా రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుంది. గత విద్యాసంవత్సరం ప్రకారం ఇంటర్ వరకు రాష్ట్రంలో 82.30 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా చేరే వారి సంఖ్యను జత చేస్తే వీరి సంఖ్య 84 లక్షల వరకు ఉంటుందని అంచనా. విద్యార్థుల స్థితిగతులు, సమగ్ర సమాచారం ప్రభుత్వం వద్ద ఆన్‌లైన్‌లో ఉన్నా కావాలనే కాలయాపన చేస్తోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ట్రెండింగ్‌లో రీల్స్

'తల్లికి వందనం' పథకం అమలులో పాలకుల తీరును సోషల్ మీడియా వేదికగా ప్రజలు తూర్పారబడుతున్నారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు కూటమి నాయకులు చేసిన విన్యాసాలకు సంబంధించిన వీడియోలకు తమ సృజనాత్మకతను జోడిస్తున్నారు. కొన్నింటికి సినీ సన్నివేశాలను జతచేస్తున్నారు. కొన్ని సినిమాల్లోని హాస్య సన్నివేశాలకు సీఎం చంద్రబాబు, మంత్రి రామానాయుడు, ఇతర నాయకులు చెప్పిన మాటలను వాయిస్ ఓవర్ జత చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. 'పోయాం.. మోసపోయాం.. తల్లికి శఠగోపం.. పదిహేను వేలకు ఎగనామం' అంటూ వాటికి రకరకాల క్యాప్షన్లు జతచేస్తున్నారు. ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా 'తల్లికి వందనం' పథకం పైనే రీల్స్ ట్రెండింగ్‌లో ఉన్నాయని చెప్పొచ్చు. అధిక సంఖ్యలో ఈ రీల్స్‌కు లైక్‌లు, షేర్‌లు, వ్యూస్, కామెంట్లు వస్తుండటం గమనార్హం.

డేటా లేదా.. ఇదిగో తీసుకో..

ఒక రీల్‌లో పిల్లల డేటా తీసుకుంటున్నట్టు మండలిలో మంత్రి లోకేష్ చెప్పిన మాటలకు రాష్ట్రంలో 84 లక్షల మంది పిల్లలు ఉన్నారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన కౌంటర్‌ను జతచేసి 'డేటా లేదా.. ఇదిగో తీసుకో' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. మరో రీల్‌లో 'ఇచ్చిన దాకా వదిలేది లేదు..' అంటూ సినీ నటుడు బ్రహ్మానందం, ఇతర నటులు నటించిన సన్నివేశాలను జతచేశారు. 'చంద్రం తాతయ్య.. మా పదిహేను వేలు ఎక్కడ' అంటూ నలుగురు చిన్నారులు చేతులు చాచి అడుగుతున్నట్టుగా.. 'తల్లికి వందనం లేకపోయినా.. నాన్నకు నాణ్యమైన బీర్లు ఇస్తున్నారు' అంటూ.. ఇలా ఎన్నో రీల్స్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.

'ఈరోజు హామీ ఇస్తున్నా.. తల్లికి వందనం కింద సంవత్సరానికి ప్రతి ఒక్క బిడ్డకి రూ.15,000 ఇచ్చే బాధ్యత నాదీ.. ఒక్కరు నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికిస్తా.. ముగ్గురుంటే ముగ్గురికిస్తా.. నలుగురుంటే నలుగురికిస్తా..'


ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలివి

'నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు' అంటూ కనిపించిన పిల్లలందరినీ చూపిస్తూ నిమ్మల రామానాయుడు చేసిన హడావుడి అయితే అంతా ఇంతా కాదు. పవన్ కల్యాణ్, నారా లోకేష్, కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు రూ.15 వేలు చొప్పున ఇస్తామంటూ ఊదరగొట్టారు. ప్రజలు వారి మాటలు నమ్మి మరోమారు మోసపోయారు.

ఏపీ .. ఏపీ .. ఏపీ ..



ఎప్పుడు.. ఎప్పుడు.. ఎప్పుడు..



మంత్రి నిమ్మలకు రీల్స్ మోత

మంత్రి నిమ్మల రామానాయుడుపై నెటిజన్ల సెటైర్లకు అంతే లేదు. ఎన్నికల ప్రచారంలో పాలకొల్లులోని ఒక ఇంటి వద్ద ఉన్న చిన్నపిల్లలను చూసి 'నీకు 15 వేలు, నీకు 15 వేలు..' అంటూ రామానాయుడు చెప్పిన వీడియో అప్పట్లో ఎంత పాపులర్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఆ మాటలకు జిల్లావాసులు గోదావరి వెటకారం, యాసను జోడించి మరీ రీల్స్ చేసి ట్రోల్ చేస్తున్నారు. ఒక నెటిజన్ పాడి పశువులు, వాటి దూడలను చూపిస్తూ 'నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 18 వేలు, నీ బిడ్డకు 15 వేలు, నీకు ఇంకో రెండు దూడలుంటే మరో రూ.30 వేలు వచ్చేవి..' అంటూ వీడియో చేస్తే.. మరో నెటిజన్ పాల బుడ్డీలు, మద్యం బాటిళ్లు పెట్టి రీల్స్ చేశారు. ఇలా ఎవరికి వారు వినూత్న రీతుల్లో కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతుండగా సామాన్య ప్రజానీకం వాటికి మద్దతుగా కామెంట్లు పెడుతూ ప్రభుత్వ తీరుపై తమ నిరసనను తెలియజేస్తున్నారు.

రైతులపై 'చంద్ర' క్రీనీడలు

- అన్నదాతలకు తప్పని అగచాట్లు
- ఇప్పటికీ అందని ఖరీఫ్ పెట్టుబడి సాయం
- వరద బాధితులనూ పట్టించుకోలేదు
- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీవీఎల్ మండిపాటు



ఆకివీడు: అన్నదాతపై చంద్ర క్రీనీడలు పడుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన తొలి ఖరీఫ్ సాగులోనే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సహకరించకపోగా, ప్రకృతి కూడా కరుణించలేదన్నారు. గత జగన్ ప్రభుత్వంలో ఏరువాకకు ముందే పెట్టుబడుల నిమిత్తం రైతు భరోసా సొమ్ము అన్నదాతల ఖాతాల్లో జమ చేసేవారమని గుర్తుచేశారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సకాలంలో అందజేశారన్నారు. విపత్తుల సమయంలోనూ రైతులకు అండగా నిలిచారన్నారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో సాయం కోసం ఎదురుచూసిన రైతులకు ఎండమావే మిగిలిందని విమర్శించారు. భారీ వర్షాలు, వరదలతో నారుమడుల దశలోనే రైతులు అవస్థలు పడ్డారని, సకాలంలో ఉచితంగా విత్తనాలు ఇచ్చి సాగుకు ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఉచితం మాట దేవుడెరుగగా, కనీసం రాయితీపై విత్తనాలు కూడా అందించలేదని ఆరోపించారు. నారు కోసం రైతులు పాట్లు పడుతున్నారని, విత్తనాలు ఇచ్చినా ఖరీఫ్ సాగు ఎప్పుడు పూర్తవుతుందని, మరలా రబీ సాగు ఎప్పుడు మొదలుపెట్టాలని ఆయన ప్రశ్నించారు. సొసైటీల ద్వారా కొత్త రైతులకు రుణాల్ని కూడా అందజేయలేదని అన్నారు. అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఆదిలోనే విఫలమైందని పీవీఎల్ విమర్శించారు.

జూదం.. ఎమ్మెల్యే పుత్రుడే కీలకం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాంతంలోని ఓ శాసనసభ్యుడి కుమారుడు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూనే తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని తెరవెనుక అక్రమార్జనకు తెగబడుతున్న విషయం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. పట్టణ పరిధిలో తెరవెనుక జూదాల నిర్వహణ, అధికారుల బదిలీల్లో తలదూర్చడం వంటి కార్యకలాపాల్లో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నట్టు కూటమి నాయకుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గతంలో విచ్చలవిడిగా సాగిన జూదానికి గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కళ్లెం వేసింది. దీంతో జిల్లాలోని వివిధ పట్టణాల్లో ఉన్న క్లబ్బుల్లో పేకాట వంటి జూదాలు గత ఐదేళ్లుగా నిలిచిపోయాయి. దీనివల్ల క్లబ్బులకు గతంలో సమకూరిన ఆదాయానికి గండి పడటంతో క్లబ్బుల్లో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలను కూడా తగ్గించారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జూదరులలో మళ్లీ ఆశలు రేగాయి. దీనికి అనుగుణంగానే రాష్ట్రంలోని ఒక శాసనసభ్యుడు ముఖ్యమంత్రితో మాట్లాడి క్లబ్బుల్లో జూదాలకు అనుమతి తెస్తానంటూ చేసిన బహిరంగ ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లబ్బుల నిర్వాహకుల్లో ఆశలు నింపింది. ఇంకేముంది తమకు తిరుగులేదనుకుంటున్న జూదరులు, క్లబ్బుల నిర్వాహకులకు జిల్లాలోని డెల్టా ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే కుమారుడు అండగా నిలిచినట్టు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని కీలక పట్టణ కేంద్రం.. పేకాట, జూదం, క్రికెట్ బెట్టింగ్‌లకు పెట్టింది పేరుగా చెబుతారు. పోలీసు అధికారులు ఎంత గట్టి నిఘా పెట్టినా ఇక్కడ జూదాలు మాత్రం షరా మామూలే. పందేలరాయుళ్లకు కొంతమంది పోలీసు అధికారులు కూడా సహాయ సహకారాలు అందిస్తారనే ప్రచారం లేకపోలేదు.

అంతా ఆయన కనుసన్నల్లోనే!

- జూదాలకు పెద్ద మొత్తంలో సొమ్ముల వసూలు
- తెర వెనకుండి నడిపిస్తున్న ఓ శాసనసభ్యుడి కుమారుడు
- ఆరోపణలు ఉన్న ఎస్సైకి పోస్టింగ్
- డెల్టాలోని కూటమి నాయకుల మల్లగుల్లాలు



ప్రత్యేకంగా ఎస్సై నియామకం

పట్టణంలో జూదం నిరాటంకంగా సాగించడానికి వీలుగా ఇటీవల తమకు కలిసివచ్చే ఎస్సైను కూడా నియమించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం పట్టణానికి బదిలీపై వచ్చిన ఎస్సై గతంలో పనిచేసిన చోట జూదాలకు అవకాశం కల్పించారని ఆయన్ను సస్పెండ్ చేసిన సంఘటనలు ఉన్నాయి. అటువంటి అధికారిని పట్టుబట్టి తీసుకురావడం కోసం జూదరులు వెనుక ఉండి పావులు కదపడంలో ఎమ్మెల్యే కుమారుడు ప్రధాన పాత్ర పోషించినట్టు చెబుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని ఒక హాలులో పేకాట నిర్వహిస్తూ జూదరుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో పాటు క్లబ్బుల్లో కూడా జూదానికి అవకాశం కల్పిస్తామంటూ క్లబ్‌ల నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డిమాండ్ చేసినట్టు చెబుతున్నారు. ఎమ్మెల్యే కుమారుడి వ్యవహారం కూటమిలోని నాయకులకు మింగుడు పడటం లేదని, ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ఆయన కిమ్మనడం లేదని అంటున్నారు. ఇదంతా చూస్తుంటే ఎమ్మెల్యే హస్తం లేకుండానే ఇదంతా జరుగుతుందా అనే అనుమానాలు కూడా కూటమి నేతలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. పైకి వివాదరహితుడిగా తనను తాను చూపించుకునే ప్రయత్నం చేస్తున్న సదరు ఎమ్మెల్యే తెరవెనుక తన కుటుంబసభ్యులతో ఇలాంటి కార్యకలాపాలు సాగిస్తున్నారని చర్చించుకుంటున్నారు.

విద్యుత్ స్తంభాలకు మోక్షం



పాలకోడేరు: 'విద్యుత్ స్తంభాలపై నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మండలంలోని వేండ్ర గ్రామంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్కలు, పొదులను తొలగించారు. విద్యుత్ ఏఈ ఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా స్తంభాల వద్ద మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

సాక్షి స్పందన

నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి

ద్వారకాతిరుమల: నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయని మొక్కజొన్న సీడు సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. ద్వారకాతిరుమల, కామవరపుకోట మండలాలకు చెందిన సుమారు 60 మంది రైతులకు దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన యిమ్మడి శ్రీను, ఈస్టు యడవల్లికి చెందిన ఎగ్గిన చిన్నాలు ఓ కంపెనీ పేరుతో ఎనిమిది నెలల క్రితం మొక్కజొన్న సీడు సాగు విత్తనాలను అందించారు. ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వస్తుందని చెప్పగా దాదాపు 130 ఎకరాల్లో ఈ సీడ్ సాగును రైతులు చేపట్టారు. తాము చెప్పినట్టుగా దిగుబడి రాకుంటే ఎకరానికి రూ.80 వేలు ఇస్తామని శ్రీను, చిన్న హామీ ఇచ్చారు. తీరా చూస్తే ఎకరాకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పండిన పంట తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తమకు పంట సొమ్ములు కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతున్నారు.



పురుగు మందు డబ్బాలతో రైతుల నిరసన

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారని గ్రామానికి చెందిన బిళ్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి, బిళ్ల నర్సింహరావు సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖలకు చెందిన విలువైన భూములను కబ్జా చేశారన్నారు. గతంలోనే ఆక్రమణలపై సర్వే నంబర్లతో సహా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు పంచాలని వారు కోరారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 2024–25లో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు జిల్లాలో 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతూ కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 8న పరీక్ష జరుగుతుందని, పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వచ్చేనెల 6 వరకు, రుసుం చెల్లింపునకు వచ్చేనెల 10 వరకు గడువు ఉందన్నారు.

క్లుప్తంగా

యోగా రాష్ట్ర పోటీలకు దండగర్ర విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన దండగర్ర హైస్కూలు విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్ : **దండగర్ర జెడ్పీ** హైస్కూల్ విద్యార్థులు గణప**వరంలో జరిగిన** జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ హెచ్ఎం సీహెచ్.చంద్రశేఖర్ సోమవారం చెప్పారు. అర్జుల మానస (ప్రథమం), మైనం దుర్గా వెంకట కోటలక్ష్మి (ద్వితీయం), పసుపులేటి రాజేష్, రాపాక వినయ్‌కుమార్ (ద్వితీయ), చెరుకు వడ్డికాసులు, తలారి ఎలిషేజ్ (నాలుగో స్థానం) ప్రతిభ కనబర్చారని వివరించారు. విశాఖపట్నంలో సెప్టెంబర్ 13, 14, 15వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో వీరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్ఎం చంద్రశేఖర్, వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, గ్రామస్తులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెంటపాడు: ప్రత్తిపాడు శివారు పంట పొలాల మధ్య ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై శంకర్ చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరానికి చెందిన గండికోట రాజేష్ (31) స్థానికంగా చేపల ప్యాకింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం అతని మృతదేహం పెంటపాడు మండలం ప్రత్తిపాడు పంట పొలాల మధ్య ఉండటాన్ని స్థానికులు గుర్తించి పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సెల్‌కు ఫోన్ చేస్తున్న భార్యకు స్థానికులు, పోలీసులు విషయాన్ని తెలిపారు. మృతుని భార్య దానేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జూనియర్ లెక్చరర్లకు సొమ్ములిప్పించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ ఏడాది మార్చిలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విధులు నిర్వహించిన జూనియర్ లెక్చరర్లకు వెంటనే డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సోమవారం ఒక ప్రకటనలో ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ విషయంపై ఇంటర్మీడియట్ బోర్డు ప్రతినిధులతో ఎన్నిసార్లు సంప్రదించినా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో విధులు నిర్వహించిన వెంటనే తమకు రావాల్సిన అమౌంట్ ఇచ్చేసేవారని, కానీ ప్రస్తుతం విధులు నిర్వహించి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్, ఉపాధ్యక్షుడు బట్టు శ్యాంప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ గద్దం రాజు, రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెనుమత్స కిరణ్ కుమార్‌రాజు ఉన్నారు.

ఉప్పు సాగుకు వరుణుడి దెబ్బ

గతంలో ఎన్నడూ లేనంతగా ఓ వైపు ఉప్పుకు గిట్టుబాటు ధర రావడంతో ఆనందపడాలో.. లేక అధిక వర్షాలతో ఉప్పు మడులు నీటమునిగి దిగుబడి తగ్గడంతో బాధపడాలో తెలియక ఉప్పు రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది ఉప్పు సాగు మొదట్లో ధర ఆశాజనకంగా ఉన్నా తరువాత ప్రకృతి కన్నెర్ర చేయడంతో దిగుబడి భారీగా తగ్గింది. దీంతో ఉప్పు రైతులు దిగాలు చెందుతున్నారు.

- సాగు ప్రారంభంలో ఆశాజనకంగా ధర
- విపత్తులతో దిగుబడిపై భారీగా ప్రభావం
- పంట నీటిపాలై తీవ్ర నిరాశలో రైతులు
- తీర ప్రాంతంలో 1500 ఎకరాల్లో సాగు

నరసాపురం : జిల్లాలోని నరసాపురం తీరంలో ఈ ఏడాది ఉప్పుసాగు చేస్తున్న రైతులను ప్రకృతి విపత్తులు నిండా ముంచాయి. జిల్లాలో నరసాపురంలో 19 కిలోమీటర్ల మేర ఉన్న తీరప్రాంతంలో ఉన్న నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 15 గ్రామాల్లో 1,500 ఎకరాల్లో ఉప్పు సాగు జరుగుతోంది.

ఒక్కసారి మడి కడితే 6 నెలల వరకు దిగుబడి

ఉప్పు సాగు కష్టంతో కూడుకున్నది. కానీ ఒక్కసారి మడి కడితే దాదాపు ఆ మడి నుంచి 6 నెలల వరకు ఉప్పు తీస్తుంటారు. దీంతో ఉప్పు సాగు లాభాలు తెచ్చిపెడుతుంది. వేసవి ప్రారంభంలో ప్రతి ఏటా మార్చిలో ఉప్పు సాగు ప్రారంభమవుతుంది. మండే ఎండల్లో చిన్న చిన్న మడులను ఏర్పాటు చేసి ఉప్పు సాగు చేస్తారు. ఒక్కో ఎకరానికి సంబంధించి 60 నుంచి 70 మడులను కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తరువాత సముద్రంలోని ఉప్పు నీటిని ఆ మడుల్లో నింపుతారు. ఇక సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు 6 నుంచి 10 మంది విపరీతంగా శ్రమిస్తేనే కానీ ఉప్పు తయారు కాదు. ఉప్పు మడి నుంచి దాదాపు 6 నెలలు వరకు ఉప్పు ఉత్పత్తి చేస్తారు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతూ ఉంటుంది. ఈ ఏడాది జూన్‌లోనే వర్షాలు ప్రారంభమై, జూలైలో ఏకంగా వరదలు రావడంతో ప్రభావం ఉత్పత్తిపై పడింది. వర్షాలకు మడులు తడిసిపోవడంతో ఉత్పత్తి రావడం లేదు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోల వరకు ఉత్పత్తి వస్తుందని, అయితే ఇప్పుడు 25 కిలోలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర పెరిగినా..

ఈ ఏడాది పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర పెరగడంతో మొదట్లో రైతులు ఆనందపడ్డారు. ఒకప్పుడు తీరంలో పండించే ఉప్పు బస్తా (50 కిలోలు) రైతుల వద్ద దళారులు రూ.100కు కొనేవారు. అయితే ప్రస్తుతం బస్తా రూ.300 పలుకుతుండగా, గిట్టుబాటు ధర మూడు రెట్లు పెరిగిన ఆనందం రైతులకు లేకుండా పోయింది. నరసాపురం తీరంలో పండించిన ఉప్పు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అసలే కొంత కాలంగా ఉప్పు సాగు కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడి కారణంగా రైతులు దీని సాగుకు ఆసక్తి చూపడంలేదు. ఈ క్రమంలో తీరంలో ఉప్పుమడులు చేపలు, రొయ్యల చెరువులుగా మారుతున్నాయి. ఆక్వా వైపు ఉప్పు రైతులు అడుగులు వేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రకృతి కూడా కన్నెర్ర చేయడం ఉప్పుసాగుకు శాపంగా మారింది.



ఆరుబయట ఉప్పు రాశులు (ఫైల్)



పండించిన ఉప్పును మడుల నుంచి గట్టుకు చేరుస్తున్న మహిళలు (ఫైల్)



పెదమైనవానిలంకలో ఉప్పు సాగు (ఫైల్)

భద్రపరచుకునే పరిస్థితి లేదు

పండించిన ఉప్పును భద్రపరచుకోవడానికి గిడ్డంగుల వంటి సదుపాయాలు లేవు. గిడ్డంగులు ఉంటే వర్షాలు వచ్చినప్పుడు పండించిన ఉప్పును వాటిలో భద్రపరుచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. పండించిన ఉప్పును రైతులు ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. దీంతో పండించిన ఉప్పు పంటకు రక్షణ ఉండదు. ఆకస్మాత్తుగా వర్షాలు పడినా, తుపాన్లు వంటి విపత్తులు వచ్చి పడినా ఉప్పు రాశులు ధ్వంసమవుతాయి. కష్టం మొత్తం కరిగిపోతుంది. ఇప్పుడు అదే పరిస్థితి. ఉప్పుసాగుకు ఇప్పటివరకు అధికార పంటగా గుర్తింపులేదు. ఉప్పు పంట ప్రకృతి విపత్తుల కారణంగా ధ్వంసమైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందదు. ఇన్సూరెన్స్ లాంటి సదుపాయాలు ఉండవు. ఉప్పుసాగును అధికార పంటగా గుర్తించాలని, మిగిలిన పంటలకు మాదిరిగా అందించే సదుపాయాలు కలుగజేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉంది.

- తీరప్రాంతం 19 కిలోమీటర్లు
- ఉప్పు సాగు చేసే గ్రామాలు గతంలో 15, ప్రస్తుతం 08
- ఏటా తీరంలో ఉప్పు ఉత్పత్తి 2వేల టన్నులు
- సాగు విస్తీర్ణం 1500 ఎకరాలు
- సాగు చేస్తున్న రైతులు 800 మంది
- పరోక్షంగా 2వేల మందికి ఉపాధి

మొదటి నుంచీ కష్టాలే



మార్చిలోనే ఉప్పు సాగు సీజన్ మొదలవుతుంది. ఈ ఏడాది ఎండ బాగా ఉండటంతో దిగుబడి మొదట్లో బాగానే వచ్చింది. అయితే జూన్, జూలై నెలల్లోనే అధిక వర్షాలు పడ్డాయి. దీంతో మడుల్లోకి నీరు చేరింది. అప్పటికే పండించిన ఉప్పును అయినకాడికి అమ్ముకున్నాం. దీంతో ఈ ఏడాది నష్టాలే మిగిలాయి. ఇక ముందు వాతావరణం ఎలా ఉంటుందో చూడాలి.

– పొన్నమండ నర్సింహమూర్తి, పీఎంలంక, ఉప్పు రైతు

ధర పెరిగినా ఏం లాభం



50 కేజీల బస్తా ధర రూ.300 పలుకుతోంది. అదీ ఈ సంవత్సరమే అంతరేటు. గత ఏడాది వరకు బస్తా రూ.100 మించి ఇచ్చేవారు కాదు. చప్పనీటి ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడం వంటి కారణాలతో డిమాండ్ పెరిగి రేటు పెరిగింది. కానీ ఏం లాభం. వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గి చాలా నష్టపోయాం.

– మైల వెంకన్న, ఉప్పురైతు, తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

నాన్నమ్మ పక్కలోంచి తీసుకెళ్లి..

- నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి
- ఏలూరు జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి ఘటన
- నిందితుడి కోసం 5 పోలీసు బృందాల గాలింపు

నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడులో దారుణం జరిగింది. నాన్నమ్మ పక్కలో నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారిని ఓ గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఒంటిపై గాయాలతో ఉన్న చిన్నారిని విజయవాడ ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఇంటి వరండాలో నాయనమ్మ పక్కలో పడుకుని నిద్రిస్తున్న నాలుగేళ్ల బాలికను ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్, బాలిక కాళ్లకు ఉన్న పట్టీలను సైతం దొంగిలించాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో బాలిక ఉండగా.. స్థానికుడు చూసి తీసుకొచ్చి బాలిక తల్లిదండ్రులు, నాన్నమ్మ, తాతయ్యలకు అప్పగించాడు. బాలిక శరీరంపై రక్కిన గాయాలుండటంతో వారు వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ వెంటనే స్పందించి డీఎస్పీని, మహిళా ఎస్ఐని అర్ధరాత్రి పల్లెర్లమూడికి పంపించారు. అనంతరం బాలికను నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు.

నిందితుడి కోసం ఐదు పోలీసు బృందాలు

ఈ ఘటనపై జిల్లా ఎస్పీ హుటాహుటిన స్పందించి ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. వీరు గ్రామంలోనూ, పల్లెర్లమూడి నుంచి హనుమాన్‌జంక్షన్ వరకూ ఉన్న సీసీ కెమేరాల పుటేజీని పరిశీలించారు. గ్రామంలోని సీసీ కెమేరా పుటేజీలో ఒక వ్యక్తి రాత్రి 10.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తుండటాన్ని గుర్తించి.. అతనే ఈ దారుణానికి ఒడిగట్టాడా.. అన్న కోణంలో విచారిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దించగా అది బాలిక ఇంటికి సమీపంలోని పామాయిల్ తోటలోకి వెళ్లింది. కాగా, దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి పల్నాడు జిల్లా మాచర్ల ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్టు సమాచారం. అతన్ని తీసుకురావడానికి పోలీసు బృందం మాచర్లకు వెళ్లింది. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న అతను కోళ్ల మేత లోడింగ్ నిమిత్తం పల్లెర్లమూడి వచ్చి అక్కడి నుంచి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో వెళ్లిపోయాడు. దీంతో అతనిపై అనుమానం మరింత బలపడింది.



సీఐ ప్రభాకర్‌రావును సంఘటనకు సంబంధించిన సమాచారం అడుగుతున్న ఆర్డీవో భవానీశంకరి



సీసీ టీవీ పుటేజీలో అనుమానితుడు

బీచ్‌లో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



జాన్‌బాబు మృతదేహం

మొగల్తూరు : పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన కొల్లి జాన్‌బాబు మృతదేహం సోమవారం లభ్యమైంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా తణుకుకు చెందిన స్నేహితులు కొల్లి జాన్‌బాబు, ఎస్‌కే అబ్దుల్ రహీమ్, ఎస్.శివప్రసాద్, ఎన్.పవన్, దుర్గ నాగు, పవన్‌లు పేరుపాలెం బీచ్‌కు ఆదివారం ఉదయం వచ్చారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం సముద్ర స్నానానికి దిగారు. వీరిలో జాన్ బాబు అలల ఉధృతికి గల్లంతయ్యాడు. గల్లంతైన ప్రదేశానికి సుమారు 3 కిమీటర్ల దూరంలోని మోళ్ళపర్రు ప్రాంతంలోని ఏటిపొర ప్రాంతంలో సోమవారం ఉదయం జాన్‌బాబు మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. స్నేహితుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ బి.సత్యనారాయణ చెప్పారు.

తణుకులో విషాదఛాయలు

తణుకు : పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన కొల్లి జాన్‌బాబు మృతితో తణుకు పాతవూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. జాన్‌బాబు మృతదేహం సోమవారం తణుకు పాతవూరులోని స్వస్థలానికి చేరుకుంది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది. చేతికందిన బిడ్డ దూరం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీ హెచ్ శ్రీనివాసరెడ్డిరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బాలిక ఈ నెల 2వ తేదీ సాయంత్రం నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి ఫిర్యాదులో తెలిపింది. బాలిక తల్లి 2వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో డ్వాక్రా సమావేశానికి వెళ్లింది. ఆ సమయంలో బాలిక ఇంటి వద్దే ఉందని, డ్వాక్రా మీటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తల్లికి బాలిక కనిపించలేదన్నారు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. తన కుమార్తె అదృశ్యంపై డాంగేనగర్‌కు చెందిన వెంకీ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొందన్నారు.

పాఠశాల ఎన్నికల్లోనూ రాజకీయ పైరవీలు



- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్లో చోటుకు ఆరాటం
- ఎమ్మెల్యే సందేశాలతో బిత్తరపోతున్న తల్లిదండ్రులు
- జిల్లాలో 1,343 పాఠశాలల్లో ఈ నెల 8న ఎన్నికలు
- ఒక్కొక్క తరగతి నుంచి ముగ్గురు సభ్యుల ఎన్నిక

భీమవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి అంశంలోనూ అనవసర రాజకీయ జోక్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే పథకాల విషయంలో కూటమి నాయకులు హంగామా చేస్తుండగా, రాజకీయాలకు పూర్తి దూరంగా నిర్వహించాల్సిన ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో సైతం తమ పార్టీల నాయకులు, సానుభూతిపరులు పదవుల్లో ఉండే విధంగా పావులు కదుపుతున్నారు. దీనికి సాక్షాత్తూ ఎమ్మెల్యే కార్యాలయం నుంచే పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు పిల్లలకు ఉచిత విద్య నిర్బంధ హక్కులోని సెక్షన్ 21 ప్రకారం పాఠశాలల్లో విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పదవీ కాలం ఈ ఏడాది జూలైతో ముగియడంతో కొత్తగా పేరెంట్స్ కమిటీల స్థానంలో నూతన ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ)గా పేరు మార్చి ఆగస్టు ఎనిమిదిన ఎన్నికలు ఇర్వహించేలా రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు.

జిల్లాలో 1,343 పాఠశాలలు

జిల్లాలో మొత్తం 1,343 పాఠశాలలకు గాను ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ అనుసంధానంగా గురుకులాలు, మైనార్టీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కొక్క తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుని వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండేళ్ల పాటు పదవిలో ఉండే కమిటీలోని సభ్యుల పిల్లలు రెండేళ్లలోపు స్కూల్ నుంచి బయటకు వెళ్లిపోతే తిరిగి ఆయా పదవులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

ఎస్ఎంసీ ఎన్నికలకు గాను ఆగస్టు ఒకటిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎనిమిదిన ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నికల నిర్వహణ పూర్తి చేయడం, రెండు గంటలకు కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం, అనంతరం మూడు గంటలకు నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ నిర్వహించాలి.

మార్గదర్శకాలు ఇలా..

స్కూల్లో ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరు కావాలి. ఎన్నికలు సాధారణంగా చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహిస్తారు. అపరిష్కృత వివాదాల అసాధారణ పరిస్థితుల్లో, రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబించాల్సి ఉంటుంది. విద్యార్థి తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా తప్పనిసరిగా మహిళకు అవకాశం ఇవ్వాలి. ఈ ఎన్నికల్లో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. ఈ ఎన్నికల ప్రక్రియలో అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయి.

ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదేశాలు..

అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో కూటమి మద్దతుదారులు ఎన్నికయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సాక్షాత్తూ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. కూటమి పార్టీల శ్రేణులకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక సందేశం పంపినట్లు తెలుస్తోంది. ఎస్ఎంసీ ఎన్నికలకు గాను కూటమి నాయకులు పాఠశాలలకు వెళ్లి సభ్యులుగా, అధ్యక్షులుగా పేర్లను స్కూల్ ప్రధానోపాధ్యాయులను కలిసి నమోదు చేసుకోవాలని, దీనికి గాను పాఠశాల పరిధిలోని కూటమి నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకుని కూటమికి మద్దతుగా ఉండే తల్లిదండ్రులు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన ఎస్ఎంసీ ఎన్నికల్లో ఎమ్మెల్యే జోక్యం ఏమిటంటూ పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ నాయకులు నిరాశ చెందొద్దు

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ నిరాశపడకుండా పార్టీ పటిష్టానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నూజివీడు మండలం సిద్ధార్థనగర్‌కు చెందిన రామిశెట్టి కృష్ణకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.50 వేల చెక్కును సోమవారం మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకపాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ఇలాంటి పాలనను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని ఎలా ఎగ్గొట్టాలా అని సీఎం చంద్రబాబు కుంటి సాకులు వెతుకుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీతో పాటు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ పటిష్టానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బాణావతు రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి రాంబాబు, మందాడ శివశంకరరావు, సంజీవ్‌కుమార్,భూక్యా కిషోర్, రామిశెట్టి సత్యన్నారాయణ, భూక్యా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రామిశెట్టి కృష్ణకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

'112'కు కాల్‌పై తక్షణ స్పందన

ఆత్మహత్య చేసుకుంటానంటూ ఫోన్‌లో అక్కకు చెప్పిన వ్యక్తి

ఏలూరు టౌన్: ఒక వ్యక్తి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫోన్‌లో చెప్పటంతో అతని సోదరి 112 నంబర్‌కు కాల్ చేసి తన తమ్ముడిని రక్షించాలంటూ వేడుకుంది. ఏలూరు టూ టౌన్ పోలీసులు వెంటనే స్పందించి సదరు వ్యక్తిని గాలించి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ ప్రసాదంపాడు ప్రాంతానికి చెందిన నక్క రాజేష్ తాను ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన అక్క లక్ష్మికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురై ఏలూరు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 112కు ఫోన్ చెప్పి తన తమ్ముడు రాజేష్‌ను రక్షించాలని కోరింది. బాధితుడి ఫొటో, వివరాలను పోలీసులకు తెలిపింది. 112 కంట్రోల్ రూమ్ సిబ్బంది ఈ సమాచారాన్ని ఏలూరు టూ టౌన్ సీఐ ప్రభాకర్‌కు అందించారు. వెంటనే రంగంలోకి దిగిన సీఐ ప్రభాకర్ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు రాజేష్ కోసం పలు చోట్ల గాలించి మొత్తానికి ఏలూరు పాత బస్టాండ్ వద్ద రాజేష్‌ను పట్టుకుని, స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారికి క్షేమంగా అప్పగించారు. మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడతానంటూ చెప్పిన రాజేష్‌ను రక్షించిన ఏలూరు పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రాజేష్‌ను పట్టుకుని తీసుకువెళుతున్న ఏలూరు టూటౌన్ పోలీసులు

క్లుప్తంగా

ప్రజల సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. టౌన్ ప్లానింగ్‌లో 9, రెవెన్యూ పరంగా 1, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి 1, మొత్తం 11 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మునిసిపల్ మేనేజర్ రవి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి తహసీల్దార్‌గా దశిక వంశీ


దశిక వంశీ

అత్తిలి: మండలం తహసీల్దారుగా దశిక వంశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో ఈయన కృష్ణా జిల్లా కలిదిండి మండల తహసీల్దార్‌గా పనిచేసి అనంతరం సాధారణ బదిలీలో భాగంగా వంశీ అత్తిలి మండల తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వర సేవలు అందజేస్తానన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం


విశేష అలంకరణలో ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మ

పెంటపాడు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ప్రత్తిపాడు వై. జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాస పూజలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈవో శ్రీదేవి సూచనల మేరకు దేవాదాయశాఖ అధికారి మొగళ్లపు పార్థసారధి ఆధ్వర్యంలో అమ్మవారికి ఆలయ అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 9,16,23 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీదేవి తెలిపారు.

మహిళల పట్ల వివక్ష విడనాడాలి


వీరంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల పట్ల వివక్ష విడనాడాలని, మహిళలను గౌరవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వీరంపాలెం అంగన్‌వాడీ సెంటర్ 113లో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని హెచ్చరించారు. ఇంటిలోని బాలబాలికలను ఇరువురిని వివక్ష లేకుండా చదవించాలన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, ఎం.సుజాత, ఎస్.చందు, జె.జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆయాలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ హర్షం

తణుకు: ఎస్సీ వర్గీకరణకు ఎలాంటి అడ్డంకులు లేవని రాష్ట్రాలు నిరభ్యంతరంగా వర్గీకరణ చేసుకోవచ్చిన సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వడం హర్షణీయమని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.జగ్జీవన్‌మాదిగ పేర్కొన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్‌మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్‌మాదిగ కృషి ఫలితంగా మాదిగలకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. జిల్లా నాయకులు సిర్రా బ్రహ్మయ్య, సొంగా ప్రసాద్, చదలవాడ సతీష్, సిర్రా సుధాకర్, నికోలస్‌రాజులు హర్షం తెలిపారు.

యోగ పోటీల్లో తణుకు విద్యార్థుల ప్రతిభ

తణుకు అర్బన్: జిల్లా స్థాయి యోగ పోటీల్లో తణుకు విద్యావ్యాలీ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కడప సురేష్ తెలిపారు. ఈనెల 4వ తేదీన యోగ అసోసియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ ఆధ్వర్యంలో గణపవరంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ వర్తక సంఘ భవనంలో నిర్వహించిన యోగ పోటీల్లో 8మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని వారిలో ఇందుకూరి అక్షిత, ఉమ్మిడి వృంద రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

ఏ దారైనా..దారుణమే...

- తణుకు, గూడెంలో రోడ్ల దుస్థితి
- అడుగడుగునా గోతులతో ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు


తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో కాలువను తలపిస్తున్న రహదారి

తణుకు అర్బన్: వర్షాకాలం ప్రారంభమైన రోజు నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు తణుకు నియోజకవర్గంలో పలు రహదారులు చిద్రమైపోయాయి. రాళ్లులేచి గుంతలుగా ఏర్పడడంతో వర్షపు నీరు నిల్వ ఉండడమే కాకుండా ప్రయాణికులు ఆ గుంతల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. ముఖ్యంగా తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రధాన రహదారి ఈ వర్షాలకు పూర్తిగా చిద్రమైపోయి ప్రయాణికులపాలిట ప్రమాదాల రహదారిగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణాలు చేయాలంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. స్టేషన్‌కు వెళ్లే పాదచారులైతే లోపలకు వెళ్లేలోపు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారితో పాటు పట్టణ ప్రాంతంలోకి వెళ్లేందుకు రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా ప్రయాణాలు చేస్తుంటారు. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులు నిత్యం ఈ రహదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాల పాలవుతున్నామని వాపోతున్నారు. తణుకు సజ్జాపురంతోపాటు హౌసింగ్ బోర్డు కాలనీ, సంతమార్కెట్, పాతవూరు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు గోతుల మయమైపోయాయి. గుంతలను తప్పించే లోపు వాహనదారులు నేలపై పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రైల్వేస్టేషన్ రోడ్డుతోపాటు చిద్రమైన రహదారుల్లో కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా దండగర్ర – జగన్నాథపురం, జగన్నాథపురం – నవాబుపాలెం, జగన్నాథపురం– మారంపల్లి, దండగర్ర – జగన్నాథపురం, మోదుగ గుంట– ఉప్పరగూడెం, దండగర్ర – ఉప్పరగూడెం, దండగర్ర – ఆరుగొలను, వెంకట్రావుపాలెం – నీలాద్రిపురం, అప్పారావుపేట – పట్టెంపాలెం, అప్పారావుపేట – మాధవరం, అప్పారావుపేట – కోరుమామిడి వంతెన వరకు, మెట్ట ఉప్పరగూడెం – ఇటుకుల గుంట రహదారులపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రహదారులు ఛిద్రంగా మారాయి. దీనికి తోడు రహదారులపై ఏర్పడిన గుంతల్లోకి నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయాల్లో ఈ రహదారులపై ప్రయాణాన్ని తలుచుకుంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా పెద్ద ప్రమాదాలే సంభవిస్తాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులను త్వరితగతిన నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే భయంగా ఉంటుంది

తణుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితి దాపురించింది. హెడ్‌పోస్టాఫీసు రోడ్డు నుంచి సాయిబాబా ఆలయం వరకు స్టేషన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వాహనదారులు గుంతల్లో పడిపోయి ఆస్పత్రుల పాలవుతున్నారు.

– ఎం.వెంకటేశ్వరరావు, తణుకు

ప్రజలకు ఇక్కట్లు



జగన్నాథపురం – మారంపల్లి, నవాబుపాలెం – జగన్నాథపురం రహదారులు అధ్వానంగా మారాయి. నవాబుపాలెం – జగన్నాథపురం రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు చిప్స్ లేచిపోవడం వాహనాలు స్కిడ్ అయ్యే పరిస్థితి వచ్చింది. రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణించాలంటే మరింత భయంగా ఉంటుంది. ఈ రహదారులను నిర్మించాలి.

– బాసంశెట్టి సుబ్బారావు, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం


అధ్వానంగా దండగర్ర - జగన్నాథపురం రహదారి


జగన్నాథపురం - మారంపల్లి రహదారిపై ఏర్పడిన గుంతల్లో చేరిన వర్షపు నీరు

సబ్సిడీ రుణాలతోనే అభివృద్ధి సాధ్యం


దళిత సేన కార్యకర్తల సమావేశంలో నినాదాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: లిడ్ క్యాప్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాల ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో దళిత సేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, బడుగు, బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధికి పనిచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు, మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు కృష్ణ, జిల్లా నాయకులు గెడ్డం సాల్మన్‌రాజు, మధుమంచి విజయ, కృష్ణాపురం, పుల్లాయగూడెం, నీలాద్రిపురం గ్రామాల దళిత సేన ఇన్‌చార్జ్‌లు జాలపర్తి వెంకటేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పెదమూర్తి రాజేంద్ర, కడియద్ద గ్రామ అధ్యక్షురాలు జాలాది సునీత, ఉపాధ్యక్షురాలు పద్మ, జగ్గన్నపేట గ్రామ అధ్యక్షుడు కంకిపాటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కిలాడి రవి, దళిత సేన కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధుల నియంత్రణ


కొమ్ముగూడెం గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణతోనే వ్యాధులు నియంత్రించవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో కీటక జనీత వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. జ్వరపీడితులు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. జ్వరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటికి తిరిగి అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఫణి, ఆరోగ్య కార్యదర్శులు లల్లీ, ఎంఎల్‌హెచ్‌పీ జమీల, ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మణరావు, ఆరోగ్య సహాయకుడు కాంతారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే దేశం అభివృద్ధి



కామర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జే చంద్రప్రసాద్

తణుకు టౌన్: ఆర్థిక అక్షరాస్యతతోనే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జే చంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం కామర్స్ దినోత్సవం సందర్భంగా తణుకులోని ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కామర్స్‌డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కామర్స్ విద్యనభ్యసించడం వలన అనేక ఉపాధి అవకాశాలున్నాయని, కామర్స్ విద్యార్థికి పరిశీలన చాలా అవసరమని చెప్పారు. ఒక వస్తువును ఎలా తయారు చేయాలని? ఎలా మార్కెటింగ్ చేయాలని?వస్తు అమ్మకాలను ఎలా పెంచాలనే విషయాలు కామర్స్ ద్వారానే తెలుస్తాయన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కెఆర్ ఫణీధర్, అధ్యాపకులు ఏ మారుతీదేవి చౌదరి, డాక్టర్ ఐవీ నారాయణ, జీ ఇందిరా కుమారి, కే రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే శిశువుకు ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తల్లిపాలతోనే శిశువులు ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఆరుగొలను కోడ్ నెం.132లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. తర్వాత ప్రత్యామ్నాయ ఆహారం అందజేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ కృపా, ఏఎన్ఎం విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే. కాజా బీ, బి.రాణి, జీఎస్ఎన్.లక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు అందించాలి

అత్తిలి: బిడ్డపుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డకు అందజేయాలని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు సీడీపీఓ బి ప్రమోదకుమారి చెప్పారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు తిరుపతిపురం సెక్టార్ బల్లిపాడు గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, విటమిన్ ఏ అధికంగా ఉండటం వల్ల కంటిచూపు బాగుంటుందన్నారు. కామెర్ల వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డకు ఆరునెలలు పూర్తయ్యేవరకు ఇతర ద్రవాలు ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. బాలల హక్కుల గురించి డీసీపీఓ మమత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి నర్సవేణి, ఎం శివసత్యవతి, బి నిర్మలకుమారి, సీహెచ్‌ఆర్ లలిత కుమారి, మహిళా సంరక్షణ అధికారిణి స్వప్నకుమారి, ఉపాధ్యాయిని పద్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను గుర్తించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిపాలు ఆవశ్యకతను ప్రతి ఒక్కరు గుర్తించాలని, పుట్టిన పిల్లలకు ముర్రుపాలు ఎంతో అవసరమని యూపీహెచ్‌సీ వైద్యులు శ్రావ్య, తనూజ, గైనిక్ నిహారికలు తెలిపారు. పట్టణంలోని బేబి సెంటర్, యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సోమవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, దుర్గ భవానీ, మెడికల్ అండ్ హెల్త్ స్టాఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై, ర్యాలీ నిర్వహించారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

పెంటపాడు: తల్లిపాల ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పెంటపాడు సర్పంచ్ సూర్యకళ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా పెంటపాడు సెక్టార్ సమావేశాన్ని సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బందికి, తల్లులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది పూర్ణ, రాజకుమారి తదితరులతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ తల్లిపాల వల్లే బిడ్డకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు పీహెచ్‌సీ సిబ్బంది, ఐసీడీఎస్ నిర్వాహకులు సర్ణ, రోజా విమల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామరక్ష

ఇరగవరం: తల్లిపాలు అమృత సమానమని, బిడ్డల ఆరోగ్యానికి జీవితాంతం రక్షణ కల్పిస్తాయని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. సోమవారం ఇరగవరంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పని సరిగా ఇవ్వాలని, పుట్టిన బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలని సూచించారు. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇస్తే రోగనిరోధక శక్తి పెరిగి బిడ్డకు జీవితాంతం రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.


అత్తిలి: ఈడూరులో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పెంటపాడు: సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యకళ


ఇరగవరం : అయితంపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెంటపాడు తహసీల్దార్‌గా ఏడిద శ్రీనివాస్


తహసీల్దార్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పెంటపాడు: మండలం తహసీల్దారుగా ఏడిద శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా కృష్ణ జిల్లా నందిగామ తహసీల్దార్‌గా సార్వత్రిక ఎన్నికల అనంతరం సాధారణ బదిలీలో భాగంగా పెంటపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ కనకదుర్గ, సర్వేయర్ల సంఘ నాయకులు రౌతు రామకృష్ణ, ఎంపీడీవో బాలాజీ, ఏవో పార్థసారధి, ఏఎస్‌వో భార్గవి, ఎంఈవో–2ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టీవీ రామకృష్ణ, సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు


అంగన్‌వాడీ, భవిత సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విశాలాక్షి, దుర్గ భవానిలు పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట 5వ వార్డులోని భవిత సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్లు మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని, చిన్న వయస్సులో పెళ్లిళ్ల చేయవద్దని, ప్రభుత్వం ఆడ పిల్లలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, ప్రభుత్వం ఆడ పిల్లలకు కల్పిస్తున్న రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిలు చేస్తే వైకల్యం గల పిల్లలు పుట్టే అవకాశం ఉందని, చిన్న వయస్సులో పెళ్లిలను ప్రోత్సహించవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.జ్యోతి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, టీచర్లు సత్యవతి, రత్నకుమారి, కె.కుమారి, ఆశా వర్కర్ పూర్ణ, సచివాలయం మహిళా పోలీస్ ప్రశాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ


సభలో వైఎస్సార్, జనసేన నాయకుల వాగ్వాదం

పెంటపాడు: ఉపాధి పనుల తనిఖీ గ్రామసభ సోమవారం పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పథక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గోవింద్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి, వాటిని పునఃసమీక్షించే కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ మాట్లాడుతూ పారదర్శకంగా ఉపాధి పనులు నిర్వహించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి వెంకటరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న, టీడీపీ నాయకులు నల్లమిల్లి చినగోపిరెడ్డి మాట్లాడుతూ ఉపాధిలో అవకతవకలు లేకుండా దుర్వినియోగమైన సొమ్మును తనిఖీ సభ్యులు రికవరీ చేయించాలన్నారు.

జనసేన, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య వాగ్వాదం

ఈ సమావేశంలో ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు మాట్లాడుతుండగా జనసేన నాయకుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి అడ్డు తగిలారు. గ్రామంలో సచివాలయం నిర్మించి రోడ్లు, డ్రెయినేజీలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని తీవ్రంగా విమర్శించారు. ఇరువురికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సర్పంచ్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.